

బీర్కూర్‌లో నీట మునిగిన పంట పొలాలు



కుప్రియాల్‌లో కిచెన్ షెడ్డుపై కూలిన వృక్షం



బ్రాహ్మణపల్లి శివారులో విరిగిపడిన విద్యుత్ స్తంభం

# కురిసింది వాన

**సోమవారం రాత్రి ప్రారంభమైన వాన బుధవారం రాత్రి వరకు కురుస్తూనే ఉన్నది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లపై నీరు ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువుల్లోకి నీరు చేరుతున్నది. వర్షం విస్తారంగా కురుస్తుండడంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.**

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూలై 19: వానకాలం సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు అంతగా కురవలేదు. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తున్నది. దీంతో జిల్లావ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి బాన్సువాడ రూరల్ మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మండలంలో 63 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోర్లం, తాడ్కోల్, ఇబ్రహీంపేట్, దేశాయిపేట్ చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతున్నాయి. నస్రుల్లాబాద్ మండలంలో 75.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నెమ్లి, అంకోల్ క్యాంపు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కంశెట్‌పల్లి, నస్రుల్లాబాద్, నెమ్లి గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. పాల్వంచ మండల కేంద్ర శివారులో ఉన్న పాల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. మాచారెడ్డిలో 44 మి.మీ, పాల్వంచలో 37.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు. దోమకొండ మండలంలో 229 మీ.మీ వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పత్తి, మక్కజొన్న పంటలు వేసిన రైతులు ఆందోళన గురవుతున్నారు. బీర్కూర్ మండలంలో 45 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వరినాట్లు వేసిన పంటపొలాలు పూర్తిగా నీటితో నిండిపోవడంతో చెరువును తలపిస్తున్నాయి. భిక్నూరు మండలంలోని బస్వాపూర్‌లో పూసల శంకర్ ఉంటున్న ఇల్లు కూలిపోయింది.


తాడ్వాయి మండలంలోని కాలోజివాడి, బ్రాహ్మణపల్లి వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో తాడ్వాయి – కామారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. బ్రాహ్మణపల్లి, కాలోజివాడి శివారు ప్రాంతాల్లో వంతెనల నిర్మాణం కోసం తాత్కాలిక రోడ్డు ఏర్పాటుచేశారు. కాలోజివాడి వద్ద నిర్మించిన తాత్కాలిక రోడ్డు కోతకు గురైంది. దీంతో కాలోజివాడి, సంగోజివాడి, చందాపూర్ గ్రామాల ప్రజలకు తాడ్వాయి మీదుగా కామారెడ్డికి వెళ్తున్నారు. మండలంలోని భీమేశ్వర వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నదని గ్రామస్తులు తెలిపారు. వాగులు పొంగిపొర్లుతున్నందున ప్రజలు అత్యవసరమైతేనే ఇండ్లలో నుంచి బయటికి రావాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. వర్షానికి చెట్టు విరిగి కరెంటు వైర్లపై పడడంతో బ్రాహ్మణపల్లికి త్రిఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్టు పడడంతో నాలుగు స్తంభాలు విరిగిపోయాయని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సరఫరాను నిలిపివేశారు. ఘటనా స్థలానికి చేరుకొని మరో లైన్ ద్వారా సింగిల్ ఫేజ్ కరెంటు సరఫరా చేశారు. త్వరలో మరమ్మతులు చేపడుతామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

నిజాంసాగర్ మండలంలో చెరువులు, కుంటలతోపాటు మంజీర పరీవాహక ప్రాంతం జలకళను సంతరించుకున్నది. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ నారాయణ సూచించారు.

పిట్లం మండలంలోని కుర్తి గ్రామ సమీపంలో ఉన్న మంజీర వాగు, తిమ్మానగర్ రహదారిలో ఉన్న నల్లవాగు పొంగి పొర్లుతున్నాయి.

సదాశివనగర్ మండలంలోని కుప్రియాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వంట గదిపై చెట్టు కూలింది. ఆ సమయంలో వంట చేసే వారు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని హెచ్‌ఎం సత్య ప్రసాద్ తెలిపారు.

వానకాలం సీజన్‌లో మొదటిసారి లింగంపేట పెద్దవాగులో నీరు పారుతున్నది. నెలన్నర క్రితం వానకాలం ప్రారంభమైనప్పటికీ వర్షాలు సరిగ్గా కురియలేదు. దీంతో పెద్దవాగులోకి అంతగా నీరు రాలేదు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో కొత్తగా నీరు వచ్చి వాగు కళకళలాడుతున్నది. ఈ వాగు ద్వారానే పోచారం ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. పెద్దవాగు పారుతుండడంతో లింగంపేట, ఎల్లారెడ్డి మండలాల రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



దుర్కి గ్రామ శివారులో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

### మండలాల వారీగా నమోదైన వర్షం వివరాలు

| క్ర.సం | మండలం | నమోదైన వర్షం (మిల్లీ మీటర్లలో) |
|---|---|---|
| 1. | మద్నూర్ | 23.3 |
| 2. | జుక్కల్ | 32 |
| 3. | పెద్ద కొడప్‌గల్ | 34.4 |
| 4. | బిచ్కుంద | 29.2 |
| 5. | బీర్కూర్ | 48.7 |
| 6. | నస్రుల్లాబాద్ | 69.9 |
| 7. | బాన్సువాడ | 58.8 |
| 8. | పిట్లం | 38.3 |
| 9. | నిజాంసాగర్ | 43.7 |
| 10. | నాగిరెడ్డిపేట | 62.5 |
| 11. | ఎల్లారెడ్డి | 46.8 |
| 12. | లింగంపేట | 56.6 |
| 13. | గాంధారి | 69.5 |
| 14. | సదాశివనగర్ | 69.1 |
| 15. | తాడ్వాయి | 46.6 |
| 16. | రాజంపేట | 49.8 |
| 17. | భిక్కనూరు | 53.1 |
| 18. | కామారెడ్డి | 58.2 |
| 19. | రామారెడ్డి | 45.3 |
| 20. | మాచారెడ్డి | 44 |
| 21. | దోమకొండ | 32.7 |
| 22. | బీబీపేట | 37.5 |
| 23. | డోంగ్లి | 28.2 |
| 24 | పాల్వంచ | 37.2 |



నిజాంసాగర్‌లో కురుస్తున్న వర్షం



బస్వాపూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు



బ్రాహ్మణపల్లి వాగులో పారుతున్న నీరు

## అతిథి అధ్యాపకుల పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి, జూలై 19 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ కళాశాలల్లో 78 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పీజీలో 50 శాతం పైన మార్కులు సాధించిన అభ్యర్థులు మూడు సెట్ల దరఖాస్తు ఫారాలను గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ సర్టిఫికెట్లను కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కలాశాలలో ఉన్న నోడల్ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు అతిథి అధ్యాపకులు పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు నేటి నుంచి ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## బాన్సువాడ ఆర్డీవోగా వి.భుజంగ్‌రావు

కామారెడ్డి, జూలై 19 (నమస్తే తెలంగాణ):

బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా వి.భుజంగ్‌రావును నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా పని చేస్తున్న భుజంగ్‌రావును ప్రభుత్వం బాన్సువాడ ఆర్డీవోగా నియమించింది. బాన్సువాడ ఆర్డీవోగా పని చేస్తున్న రాజాగౌడ్‌ను బోధన్‌కు బదిలీ చేసిన విషయం విదితమే. భుజంగ్‌రావు వచ్చే శాసన సభ ఎన్నికల్లో బాన్సువాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కూడా వ్యవహరించనున్నారు.

## ఎస్సై చొరవతో కుటుంబ సభ్యుల చెంతకు బాధితుడు

పెద్దకొడప్‌గల్, జూలై 19: ఎస్సై చొరవ తీసుకోవడంతో ఓ బాధితుడు కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడకు చెందిన నర్సింహులు ఇటీవల ఇంట్లో నుంచి వెళ్లాడు. అతడు పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం అటవీ ప్రాంతంలో పడిపోయాడు. మంగళవారం గమనించిన పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై కోనారెడ్డి, సిబ్బంది అతడిని తీసుకువచ్చి తమ వాహనంలో బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితుడు వివరాలు కూడా చెప్పే స్థితిలో లేకపోవడంతో ఎస్సై కోనారెడ్డి.. బాధితుడి ఫొటోను బాన్సువాడ వాట్సాప్ గ్రూపులో షేర్ చేశాడు. బాధితుడి తమ్ముడు పురుషోత్తం గుర్తించి బుధవారం ఉదయం ప్రభుత్వ దవాఖానకు చేరుకున్నాడు. ఎస్సై కోనారెడ్డి.. తమ అన్నకు పునర్జన్మను ప్రసాదించాడని కృతజ్ఞతలు తెలిపారు.



బాధితుడిని దవాఖానలో చేర్పిస్తున్న ఎస్సై కోనారెడ్డి

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ

పెద్దకొడప్‌గల్, జూలై 19: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ విశాలాక్షి బుధవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులతో క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో దేవీసింగ్‌తోపాటు జె.గంగాధర్, ఎస్.రాందాస్, రాథోడ్ బలరాం, కంప్యూటర్ ఆపరేటర్ ఎస్.పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక కుప్పల సీజ్

బిచ్కుంద, జూలై 19: మండలంలోని హస్గుల్ గ్రామంలో కొందరు అనుమతి లేకుండా ఇసుకను నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ భరత్ గ్రామానికి వెళ్లి ఇసుక కుప్పలను సీజ్ చేశారు. వీఆర్ఏను ఇసుక కుప్పల వద్ద కాపలా ఉంచారు. వాటికి త్వరలోనే వేలం వేస్తామని తహసీల్దార్ తెలిపారు.